క్లుప్తంగా

1న మాన్యం కౌలుకు వేలం

శిరివెళ్ల: జూన్ 1వ తేదీన కోటపాడు శ్రీ వీరభద్ర, చెన్న కేశవస్వామి ఆలయాల మాన్యం కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈఓ వేణునాథరెడ్డి గురువారం తెలిపారు. శ్రీ వీరభద్ర స్వామి ఆలయానికి 38.27 ఎకరాలు, చెన్న కేశవస్వామి ఆలయానికి 45.58 ఎకరాల భూములన్నాయన్నారు. ఏడాదికి సంబంధించి వేలం నిర్వహిస్తున్నామని, నిర్దేశించిన డిపాజిట్లు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని చెప్పారు. ఆలయాలకు బకాయిలున్న వారు పాటలకు అనర్హులని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య జయంతి



ప్రత్యేక అలంకరణలో అన్నమయ్య

నంద్యాల(వ్యవసాయం): సంజీవనగర్ రామాలయంలో అన్నమయ్య జయంతిని గురువారం శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే అన్నమయ్య మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నమయ్య ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు.

ముగిసిన శివసప్తాహ భజనలు



కలశ ఉద్వాసన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె గ్రామంలో వెలసిన శ్రీ గౌరీ మల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీ శివసప్తాహ అఖండ భజనోత్సవాలు ముగిశాయి. ఈ నెల 16 నుంచి ఆలయంలో భజనలు సాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఉపన్యాసకులు భక్తులకు తమ ఉపన్యాసాలను వినిపించారు. చివర రోజు వైశాఖమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా నవ ధాన్యాలలో ఉంచి పూజలు చేసిన కలశ ఉద్వాసన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో చేపట్టారు. కలశాన్ని గంగలో శుద్ధి చేయడంతో కార్యక్రమాలు ముగిశాయి. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం చేశారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం



జూనియర్ కళాశాలగా మారనున్న జెడ్పీ ఉన్నత పాఠశాల

దొర్నిపాడు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు హెచ్ఎం శ్రీనివాసరావు గురువారం తెలిపారు. కావున బైపీసీ, ఎంపీసీ, సీఈసీ కోర్సులు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, ప్రస్తుతం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్‌లో చేరేందుకు చక్కటి అవకాశమని చెప్పారు. నూతన జూనియర్ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని, పట్టణాలకు బస్సుల్లో వెళ్లి ఇబ్బందులు పడటం కన్నా స్థానికంగా చేరేలా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు.

ప్యాకింగ్ చేసిన విత్తనాలనే విక్రయించాలి

నంద్యాల(అర్బన్): రైతులకు లూజు విత్తనాలు విక్రయించరాదని, ప్యాకింగ్ చేసిన వాటిని మాత్రమే విక్రయించాలని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు అధ్యక్షతన మండలంలోని రిటైల్ సీడ్స్ దుకాణ యజమానులకు విత్తన క్రయవిక్రయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మరాదని, విత్తనాలు కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించని డీలర్లపై విత్తన చట్టం ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కార్మికులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలి



జేసీకి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల్లో పని చేసిన మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య, భాస్కరాచార్యులు మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులతో పని చేయించారని, ఈ సేవలకు అధికారులు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అక్కడి నుంచే ఓట్ల లెక్కింపు ఆరంభం

- ఆళ్లగడ్డ నియోజకవర్గ ఓట్ల కౌంటింగ్ గుండుపాపల గ్రామం నుంచి మొదలు
- నియోజకవర్గంలో మొదటి పోలింగ్ కేంద్రం కూడా అదే గ్రామం
- చివరి 295 పోలింగ్ కేంద్రం డి.కొత్తపల్లె
- మొదటి ఓటరు కూడా గుండుపాపల వాసే



ఆళ్లగడ్డ నియోజకవర్గం మ్యాప్



గుండుపాపల- 1 పోలింగ్ కేంద్రంలో ఓటుకోసం బారులు తీరిన గ్రామస్తులు (ఫైల్)

దొర్నిపాడు: ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టమైన పోలింగ్ ఈనెల 13న ముగిసింది. ఓటర్లు ఎంతో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకోని ఓటు నమోదు శాతాన్ని అమాంతం పెంచేశారు. నేతల తలరాతలను ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఓటింగ్ రోజు నుంచి ఎక్కడ ఇద్దరు ముగ్గురు కూడినా ఎవరు గెలుస్తారు..ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది...ఏ గ్రామంలో ఏ పార్టీ ఆధిక్యత సాధిస్తుందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి.

లెక్కింపులో ప్రత్యేకత..

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 295 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మొదటి పోలింగ్ కేంద్రం మండలంలోని గుండుపాపల గ్రామం నుంచి ప్రారంభం అవుతుంది. దీంతో కౌంటింగ్ కూడా గుండుపాపల 1, 2, ఉమాపతి నగరం3, క్రిష్టిపాడు 4, 5, ఉయ్యాలవాడ మండలం 6, 7లతో ప్రారంభం అవుతుంది. ఇలా ప్రారంభమై చాగలమర్రి మండలంలోని 295 పోలింగ్ కేంద్రం డి.కొత్తపల్లెతో కౌంటింగ్ ప్రక్రియ ముగిసి తుది ఫలితం వెలువడనుంది.

మొదటి కేంద్రంలో 898 ఓటర్లు..
చివరి కేంద్రంలో 978 ఓటర్లు..

తొలి పోలింగ్ కేంద్రమైన గుండుపాపల 1వ పోలింగ్ కేంద్రంలో 898 ఓటర్లు ఉండగా 796 మంది ఓటర్లు ఓటు వేశారు. చివరి పోలింగ్ కేంద్రం డి.కొత్తపల్లెలో 978 మంది ఓటర్లు ఉండగా 849 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

2,32,676 ఓటర్లలో
మొదటి ఓటరు ఇతడే..

మొదటి పోలింగ్ మండలంలోని గుండుపాపల గ్రామంతో ప్రారంభం అవుతుంది. ముల్ల హబీబ్ బాషా అనే యువకుడు తొలి ఓటరు కావడం గమనార్హం. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న 2,32,676 మంది ఓటర్లలో అతడే తొలి ఓటరు కావడంతో సంబరపడుతున్నాడు. మొదటి పోలింగ్ స్టేషన్ సీరియల్ నంబర్ 1లో ఐజీక్యూ1388701 అనే ఓటర్ ఐడీ కార్డును కల్గి ఉన్నాడు. నియోజకవర్గంలో తొలిఓటరు అయినందుకు సంతోషంగా ఉందని, పోలింగ్ రోజు కూడా మొదట నేనే ఓటు వేశానని సంబర పడుతున్నాడు.

నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల వివరాలు

నియోజవకర్గంలోని ఆళ్లగడ్డ, చాగలమర్రి, దొర్నిపాడు, రుద్రవరం, శిరివెళ్ల, ఉయ్యాలవాడ మండలాల్లో పురుషులు 1,14,955, స్త్రీలు 1,17,709, ఇతరులు 12 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 2,32,676 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 97,494 మంది, స్త్రీలు 98,082, ఇతరులు ఆరుగురు ఓటు హక్కును వినయోగించుకున్నారు. మొత్తం 2,32,676 మంది ఓటర్లకు గాను 1,95,582 మంది తమ ఓటును సద్వినియోగం చేసుకోవడంతో 84.06 శాతం నమోదైంది.

ఘనంగా అబ్దుల్లా స్వామి ఉరుసు

గోస్పాడు: మండలంలోని జూలేపల్లె గ్రామంలో అబ్దుల్లా స్వామి ఉరుసు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దర్గాను ప్రత్యేకంగా అలంకరించారు. ఉరుసు సందర్భంగా గ్రామంలో మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగడం ఆనవాయితీ. గురువారం ఉరుసు సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం గంధం కార్యక్రమం, గురువారం ఉరుసు, శుక్రవారం వేకువజామున జెండాను గ్రామంలో ఊరేగిస్తామని దీంతో ఉత్సవాలు ముగుస్తాయని గ్రామ పెద్దలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గోకారమయ్య ఉరుసు



గోకారమయ్య దర్గా వద్ద భక్తుల సందడి

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామంలో వెలసిన హజరత్ గోకారమయ్య స్వామి ఉరుసు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ప్రారంభమైన ఉరుసులో వందలాది మంది భక్తులు దర్గాను సందర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి చెక్క భజన కార్యక్రమం అలరించింది. నిర్వాహకులు మాట్లాడుతూ శుక్రవారం స్వామి వారి జెండా ఊరేగింపు ఉంటుందని చెప్పారు.

లోక కల్యాణం కోసం హోమాలు



వరుణ యాగం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన స్పటిక లింగేశ్వర ఆలయంలో వైశాఖ మాస పౌర్ణమి పురస్కరించుకొని గురువారం నిర్వాహకులు యోగానంద స్వామి ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. స్పటిక లింగేశ్వరుడికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం అనంతరం రుశ్యశృంగ మహాముని వరుణ మంత్రంతో వరుణ యాగం జరిపించి పూర్ణాహుతి గావించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే.. మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నృసింహ స్వామి జయంతిని పురస్కరించుకొని సుదర్శన హోమం చేపట్టి పూర్ణాహుతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేదపండితులు రామ్మూర్తి, నిర్వాహకులు మధుసూదనరాయల్ పాల్గొన్నారు.

సిద్ధార్థుడి బాట అనుసరణీయం

నంద్యాల(వ్యవసాయం): సిద్ధార్థుడి బాట అనుసరనీయం, ఈ సర్వశ్రేష్ఠుడి మాట అమరమని డాక్టర్ గెలివి సహదేవుడు పేర్కొన్నారు. గురువారం కుందూ సాహితీ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని టౌన్ మున్సిపల్ పార్కులో బుద్ధ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ కురుమేటి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి నాడు జన్మించిన గౌతమ బుద్ధుడు వైశాఖ పౌర్ణమి నాడే జ్ఞానోదయం పొందడం అదే పౌర్ణమి నాడే నిర్యాణం పొందడం విశేషమన్నారు. ఆయన బోధించిన అష్టాంగ మార్గం ప్రపంచ చరిత్రలో శాశ్వత స్థానం పొందాయన్నారు. జీవితం అనుభవాల లోతుల్లో నుంచి ఎన్నో అంశాల్ని ప్రపంచానికి అందించిన గౌతముని బాటలో నేటి సమాజం నడవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీనిధి రఘువీర్, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, దండు వెంకటేశ్వర్లు, మహేశ్వరరెడ్డి, నీలం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం



నంద్యాల పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: ఓట్ల లెక్కింపు అనంతరం విజేతల అభ్యర్థులు, వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు చేపట్టరాదని, ఎన్నికల కమిషన్ వాటిపై నిషేధం విధించిందని నంద్యాల టూటౌన్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, తాలూకా ఇన్‌స్పెక్టర్ దస్తగిరి బాబు తెలిపారు. స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం సంజీవనగర్, రోజాకుంట, శ్రీరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరూ కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లోనికి వెళ్లరాదని, పట్టణంలో ఎటువంటి అల్లర్లు జరుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. గెలిచినవారు విజయోత్సవ ర్యాలీలు చేయటానికి, బాణసంచా కాల్చడానికి అనుమతి లేదని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐలు నవీన్, దానమ్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండెక్కిన చికెన్

- కిలో కోడి మాంసం ధర రూ.300 పైగానే
- కోడి గుడ్ల ధర కూడా పైపైకి
- మటన్ కిలో రూ.800 నుంచి రూ.850



చికెన్ సెంటర్‌లో విక్రయిస్తున్న మాంసం

గోస్పాడు: కోడి మాంసం ధరలకు రెక్కలు వచ్చాయి. కొన్నాళ్ల నుంచి ఒకింత అందుబాటు ధరలో ఉన్న చికెన్ ఇప్పుడు అమాంతంగా పెరిగిపోయింది. రెండు నెలల పాటు కిలో చికెన్ రూ.160–200 మధ్య ఉండేది. మూడు వారాల నుంచి స్వల్పంగా పెరుగుతూ తాజాగా రూ.300కి చేరుకుంది. మొన్నటి వరకు తక్కువ ధర పలికిన చికెన్ ధర ఇప్పుడు ఏకంగా రూ.300కు చేరుకోవటంతో సామాన్యులు హడలిపోతున్నారు. చికెన్ కోసం కోళ్లను మహబూబ్‌నగర్, హైదరాబాద్, చిత్తూరు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి కోళ్లను స్థానిక వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణా చార్జీల భారాన్ని వ్యాపారులు కొనుగోలుదారులపై వేస్తున్నారు. ఈ ఏడాది మార్చి మూడో వారం నుంచే ఎండలు, వడగాడ్పులు ఏప్రిల్ నాటికి తీవ్ర రూపం దాల్చాయి. దీంతో కోళ్ల ఫారాల్లో కోళ్లు కూడా తగ్గిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కోళ్ల కొరత ఫలితంగా చికెన్ ధరలు పెరగడానికి కారణమైందంటున్నారు. డిమాండ్ కు తగినన్ని బ్రాయిలర్ కోళ్ల లభ్యత లేకపోవడంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ఈనెల ఆరంభంలో కిలో స్కిన్ లెస్ బ్రాయిలర్ చికెన్ రూ.250 ఉండగా ఇప్పుడది రూ.300కి ఎగబాకింది. ఫారాల్లో కొత్తగా వేసిన కోళ్లు అందుబాటులోకి రావాలంటే మరో మూడు నుంచి నాలుగు వారాల సమయం పట్టే అవకాశం ఉందటంతో మరికొన్ని రోజుల పాటు చికెన్ ధర పెరుగుదల ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ధర పెరగడంతో కొంత మేర వ్యాపారాలు తగ్గాయంటున్నారు. ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో బాయిలర్ చికెన్ ధర ఒకలా ఉంటే నాటుకోడి ధర మరింత ప్రియంగా మారింది. కిలో నాటుకోడి ధర రూ 650 నుంచి రూ.700 వరకు పలుకుతోంది.

మండుతున్న మటన్ ధర..

మాంసాహార ప్రియులకు మటన్ ధర కూడా మంట పుట్టిస్తోంది. కొద్ది రోజుల క్రితం వరకు రూ.700 పలికిన మటన్ ధర ఇప్పుడు రూ.800 నుంచి రూ.850 చేరడతంతో కొనుగోలుదారులకే కాదు వ్యాపారులకు సైతం అర్థం కాని పరిస్థితి నెలకొంది. జీవాల రేట్లు విపరీతంగా పెరగటంతో అధిక మొత్తం వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

గుడ్ల ధరలూ పైపైకే..

చికెన్ ధర కొండెక్కి కూర్చుంటే కోడిగుడ్ల ధరలు కూడా అదే దారిలో పయనిస్తున్నాయి. మార్చిలో వంద గుడ్ల రేటు రూ.425 నుంచి రూ.440 వరకు ఉండగా, ఏప్రిల్‌లో కొంతమేర తగ్గి రూ.405కి చేరింది. నాడు రూ.50 నుంచి రూ.60కే డజన్ గుడ్లు లభ్యమయ్యేవి. అయితే ప్రస్తుతం హోల్‌సేల్ వ్యాపారులే రూ.600 ప్రకారం విక్రయిస్తున్నారు. దీంతో రిటైల్ మార్కెట్లో ఒక్కొక్క గుడ్డు రూ.7కు చేరింది.



అమ్మకానికి సిద్ధంగా గుడ్లు

ముగిసిన దత్తాత్రేయ హోమాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల(అర్బన్): మండలంలోని మిట్నాల గ్రామంలోని అవధూత శ్రీరామస్వామి దేవాలయంలో శ్రీపాద శ్రీవల్లభ జాతక గురుబల సిద్ధి వ్రతం, శ్రీదత్తా హోమాలు పూర్ణాహుతులతో గురువారం ముగిశాయి. నిర్వాహకులు సదాశివారెడ్డి ఆధ్వర్యంలో గురుబల సిద్ధవ్రతం గ్రంథ రచయిత దువ్వూరి భాస్కర రావు, శ్రీపాదదాసుల పర్యవేక్షణలో నిర్వహించిన శ్రీదత్త హోమాల్లో విజయవాడ, హైదరాబాద్, కాకినాడ, తిరుపతి, నర్సరావుపేట తదితర ప్రాంతాలకు చెందిన 121మంది కలశాలతో పాల్గొన్నారు. 4వేల మందికి పైగా భక్తులు పాల్గొన్న కార్యక్రమంలో పూర్ణాహుతి అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం దత్తాత్రేయ, లక్ష్మీదేవి, శ్రీపాద వల్లభ ఉత్సవమూర్తులను ఊరేగించారు. గ్రామోత్సవం సందర్భంగా గ్రామ దేవతలకు నూతన పట్టువస్త్రాలు సమర్పించారు.

అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న డీపీఓ మంజులవాణి

రుద్రవరం: వర్షాలు కురుస్తున్నాయని కొత్త నీరు వచ్చి చేరుతుండంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని డీపీఓ మంజులవాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ముందస్తుగానే వర్షాలు కురుస్తున్నాయని, తద్వారా కొత్తనీరు వచ్చి చేరుతుందన్నారు. నీరు కలుషితం కావడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశమున్నందున 21 గ్రామాల్లోని నీటి ట్యాంక్‌ను శుభ్రం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని చెప్పారు. అలాగే పారిశుద్ధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ రామచంద్ర, ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ ఉన్నారు.

దాడి కేసులో మరో ముగ్గురి అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ : మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ప్రధాన అనుచరుడు నిఖిల్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో మరో ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితులు షేక్ మాలిక్ బాషా, షిండే చంద్రకుమార్, తప్పెట నరసింహ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న టీ కొట్టులో ఉన్నారనే సమాచరంతో సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ నగీన అదుపులోకి తీసుకుని విచారించి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. కాగా కేసులో ప్రధాన సూత్రదారి ఏవీ సుబ్బారెడ్డి, మరో నిందితుడు చంటి కోసం కోసం విస్తృతంగా గాలిస్తున్నామని త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు.

వైభవం.. సత్యదేవుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన మహిళలు

నంద్యాల(వ్యవసాయం): కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో గురువారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని సత్యనారాయణ వ్రతం, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ఉదయాన్నే విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం సామూహిక ఉచిత సత్యనారాయణ వ్రతాలు చేయించారు. తదనంతరం వేదపండితులు ప్రసన్నకుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. వేడుకను తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులకు హాజరయ్యారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో కోలాటాల నడుమ గ్రామోత్సవం చేపట్టారు. దేవాలయ చైర్మన్ యాడికి శ్రీదేవి, ఈఓ నాగప్రసాద్, స్వర్ణ, సత్యనారాయణ, అమ్మని, సుధారాణి, వెంకటేశ్వర్లు, బాలుడు పాల్గొన్నారు.

నేటి నుంచి పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



నంద్యాల ఎస్పీజీ పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నేటి నుంచి జరగనున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అధికారులు పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్ట వసతులు కల్పించారు. పరీక్షల హాల్ టికెట్లను డీజీఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌తో పాటు ఇంటర్ హాల్ టికెట్లను బీఐఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్లలో అందుబాటులో ఉంచారు.

పది పరీక్షలకు 27 పరీక్ష కేంద్రాలు..

24వ తేదీ నుంచి జూన్ 3 వరకు జరగనున్న 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా 7,748 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షలకు 27 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో సహా 279 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పరీక్ష రోజు ఫీజు చెల్లించినా హాల్‌టికెట్లు..

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు పరీక్ష రోజు ఫీజు చెల్లించినా హాల్‌టికెట్లు ఇస్తామని అధికారులు తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఫీజు చెల్లించకపోయినా వెంటనే ఫీజు చెల్లించి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావచ్చు. ఈ అవకాశాన్ని ఫెయిల్ అయిన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఇంటర్‌కు 31 పరీక్ష కేంద్రాలు...

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 13,748 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 31 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు రాయనున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్న ద్వితీయ సంవత్సర పరీక్షలకు 4,398 మంది హాజరు కానున్నారు.

సంస్కారాన్ని నేర్పించేది శ్రీసరస్వతి విద్యాపీఠం



మాట్లాడుతున్న మహానంది క్షేత్ర ఈఓ చంద్రశేఖర్ రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారాన్ని నేర్పించేది శ్రీసరస్వతీ విద్యాపీఠం పాఠశాలలు అని మహానంది ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రామకృష్ణ పీజీ కళాశాలలో విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆచార్య ప్రశిక్షణ – 2024 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 174 సరస్వతీ విద్యాపీఠం పాఠశాలల నుంచి 32 మంది ఆచార్య మాతాజీలు శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఆలయ అధికారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహానందిలో చెంచులు, వారి పిల్లల కోసం విద్యాభారతి పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

గొర్రెలపైకి దూసుకెళ్లిన కారు

మహానంది: బండిఆత్మకూరు మండలంలో గురువారం కారు ఢీకొనడంతో రెండు గొర్రెలు మృతి చెందాయి. నంద్యాల నుంచి సంతజూటూరుకు వస్తున్న కారు స్థానిక సహకార బ్యాంకు వద్ద ప్రమాదవశాత్తు గొర్రెల మందపైకి దూసుకెళ్లింది.. అనంతరం చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్‌కు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది.